
దరఖాస్తులకు మోక్షం



- ఆహార భద్రత కార్డుల్లో సవరణలకు అవకాశం
- మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు
- నాలుగేళ్ల తర్వాత మొదలైన సేవలు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిం ది. ఆహార భద్రత కార్డు ఉండి..వాటిల్లో తప్పుల సవరణ, మార్పులు, చేర్పుల కోసం ఎదురు చూసే వారికి ఊరటను కల్పించే విధంగా దరఖాస్తులు చేసుకోవాలని సర్కారు సూచించింది. ఎన్నో ఏళ్లుగా చిన్న చిన్న సవరణలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆహార భద్రతా కార్డు కలిగిన వారు మాత్రమే మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అ వకాశం ఇటీవల కల్పించింది. ఆహార భద్రత కార్డు కలిగిన లబ్ధిదారులు కార్డుల్లో దొర్లిన తప్పులతో పాటు కొత్త సభ్యుల పేర్లను కూడా చేర్చుకు నేందుకు దరఖాస్తు చేసుకోవచ్చును. గతంలో దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్నవి కాకుండా కొత్తగా కూడా దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య కూడా వేలల్లోనే ఉండనుంది.

జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రత కార్డుల సంఖ్య..

జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 592 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీ నెల పేదలకు ఉచిత బియ్యం, రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. జిల్లాలో మొత్తం 3,07,127 రేషన్ కార్డులుండగా ఇందులో 2,92, 450 ఆహార భద్రతా కార్డులు, 14,352 అంత్యోదయ కార్డులు, 145 అన్న పూర్ణ కార్డులున్నాయి. ప్రతీనెల సుమారు 9,197 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సుమారు 8,82,187 మందికి పౌరసరఫరా శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు.

నెర వేరనున్న పేదల ఆశ..

ఆహార భద్రత కార్డులను గత ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. చివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు కూడా చేసుకునే అవకాశం లేకుండా తొలగిం చింది. దీంతో కొత్త కార్డుల ఊసే లేకుండా పోయింది. ఇదే కాకుండా పాత కార్డులలో సవరణలు చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేసింది. దీంతో అర్హులంతా కూడా మీ సేవా కేంద్రాలకు, సివిల్ సప్లయి కార్యాలయానికి ఏళ్ల తరబడి తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వం ఎప్పుడు అవకాశం ఇస్తుందా... అంటూ ఏళ్ల తరబడి ఎదురు చూస్తూనే ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జగిత్యాలలో గల సివిల్ సప్లయి కార్యాలయానికి చేసిన దరఖాస్తు వివరాలు తెలుసుకునేందుకు లబ్ధిదారులు వచ్చిపోవడం దూర భారంగా మారేది. మీ సేవా కేంద్రాలలో దరఖాస్తుల స్వీకరణ మొదలవ్వడంతో లబ్ధి దారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

కార్డుల్లో చేసే మార్పులివే...

ప్రభుత్వం సుమారు నాలుగేళ్ల తర్వాత ఇటీవలే మీ సేవలకు ఆహార భద్రత కార్డుల్లో చేర్పులు, సవరణలు, మార్పులకు అవకాశం కల్పించింది. అంటే ఇప్పటికే ఆహార భద్రత కార్డులు ఉన్న వారికే ఈ అవకాశం ఉంటుంది. చిరునామా, కుటుంబ సభ్యుల కొత్త పేర్ల నమోదు, ఆధార్, పేర్ల నమోదులో దొర్లిన తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు, తదితర సేవలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులు మాత్రమే ఈ సేవలను పొందే అవకాశం ఉంటుంది.

కొత్త కార్డుల కోసం ఎదురుచూపులే...

రాష్ట్రం ఆవిర్భావం నుంచి దాదాపుగా ఒకటి, రెండు పర్యాయాలు మినహా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయలేదు. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా హడావిడిగా కొంత మందికి కొత్తగా రేషన్ కార్డులను జారీ చేసి చేతులు దులుపుకున్నారు. 2016 లో ప్రభుత్వం ఆహార భద్రత కార్డులను జారీ చేసింది. ఆ సందర్భంలో చాలా మంది కొత్తగా కార్డులు, పేర్ల మార్పిడి, పిల్లల పేర్లు చేర్పించుకోవడం, అడ్రస్ మార్పిడి తదితర వాటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అలాంటి సమస్యలు పరిష్కారం కాకపోనూ చాలా మందికి కొత్త రేషన్‌కార్డులు అందని పరిస్థితి నెలకొంది. కొన్నేళ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ సైట్ ను మూసి ఉంచుతోంది. ప్రస్తుతం కొత్తరేషన్ కార్డు కోసం కనీసం దరఖాస్తు చేసుకుందామన్న వీలులేని పరిస్థితి నెలకొంది. ఒక వైపు ఆన్‌లైన్ సైట్ బంద్ చేసి ఉండ డం, మరో వైపు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించకపోవడంతో ఏం చేయాలో.. ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయో మయ పరిస్థి తిని బాధితులు ఎదుర్కొంటున్నారు.

నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా...

పల్లికొండ అనిల్, వెల్గొండ



మా కుటుంబానికి ఆహార భద్రతా కార్డు ఉంది. అయితే సుమారు అయిదు సంవత్సరాల క్రితం కొడుకు పుట్టాడు. ఆహార భద్రతా కార్డులో మా కుమారుడి పేరు చేర్చడానికి నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ మా ఆహార భద్రతా కార్డులో మా కుమారుని పేరు చేర్చలేదు. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నా.

మార్గదర్శకాలు వస్తే పనులు వేగవంతం చేస్తాం

వెంకటేశ్వర్ రావు, జిల్లా సివిల్ సప్లయి అధికారి



ప్రభుత్వం నుంచి ప్రస్తుతం మీ సేవా కేంద్రాల వారికి మాత్రమే ఆదేశాలు వచ్చాయి. వారు దరఖాస్తులను స్వీకరించేందుకు కూడా అవకాశం కల్పించారు. మరోవైపు దీనికి సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్ కూడా అందుబాటులోకి వచ్చింది. కానీ ఇంకా మార్పులు, చేర్పుల కోసం స్పష్టమైన ఆదేశాలు రాలేదు. వీటికి సంబంధించిన మార్గదర్శకాలు వస్తే అందుకు తగ్గట్టుగా పనులను వేగవంతం చేసి సకాలంలో సవరణలు, మార్పులు, చేర్పులు తదితర పనులను పూర్తి చేస్తాము



అడవులను కాపాడుకుంటేనే మానవ మనుగడ

- వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్



ఊటపల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

కథలాపూర్, జూలై 22 : అంతరించిపోతున్న అడవులను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. మండలంలోని ఊటపల్లిలో సోమవారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అడవులను సంరక్షించడానికి ప్రభుత్వం ఎంతో కృత నిశ్చయంతో ఉందని ఈ మేరకు వన మహోత్సవంలో కోట్లాది మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరం చేసిందన్నారు. చెట్ల వల్ల కార్బన్ డై ఆక్సైడ్ విడుదలై జనం ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టడానికి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చూడాలని కోరారు. కలికోట సూరమ్మ చెరువు, రాళ్లవాగు ప్రాజెక్ట్ కాలువల పనులు కొద్ది రోజుల్లో ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు. పల్లెలను కలిపే లింకు రోడ్లు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్, ఎంపీవో ప్రవీన్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఎగ్యారపు శ్రీహరి, పులి హరిప్రసాద్, ముదాం శేఖర్, వాకిటి రాజరెడ్డి, పిడుగు తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

ఎస్పీ అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 22 :ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ లక్ష్యమని వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిన జిల్లా విద్యార్థులు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. బెల్లంపల్లిలోని ఆర్‌పీ గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జగిత్యాలకు చెందిన క్రీడాకారులు 4 బంగారు పతకాలు, 1 సిల్వర్ పతకం, 4 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రతిభ కన బరిచిన విద్యార్థులు హంసిక, ఆరాధ్య, మహిజ, శివమణి, అక్షయ, సమీక్ష, నిహారిక, సాదృశ్‌లను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, జగిత్యాల జిల్లా చైర్మన్ మంచాల కృష్ణ, అధ్యక్షుడు కోల గంగారాం, ఉపాధ్యక్షుడు కోటగిరి భీమశ్‌లు అభినందించారు. వచ్చే నెలలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు సంబంధిత విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోచ్‌లు సోయబ్, రమేశ్, గందె సంతోష్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ డీఎంగా హబీబ్

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ డీఎంగా హబీబ్ సోమవారం నియామకం అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎం దివ్య భారతిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. హైద్రాబాద్‌లో పనిచేస్తున్న హబీబ్‌ను జగిత్యాల డీఎంగా నియమించారు. జగిత్యాలతో పాటు కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల డీఎంగా హబీబ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు మార్క్‌ఫెడ్ అధికార వర్గాలు తెలిపాయి.

సివిల్స్ ర్యాంకర్‌కు ఘన సన్మానం

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్‌సీ ఇటీవల ప్రకటించిన సివిల్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 27వ ర్యాంక్ సాధించిన సాయి కిరణ్‌ను జగిత్యాల ముద్దు రామకృష్ణయ్య మెమోరియల్ అధ్యక్షుడు సూరజ్ శివ శంకర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ ప్రతిభను గుర్తించి శాలువ కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ ముద్దు రామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయికిరణ్‌ను సత్కరించడం సంతోషకరం గా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు గైని లచ్చన్న, పూటూరి నీలకంఠం, పడకంటి ఆనందం, కస్తూరి రాధాకిషన్, ప్రభాకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



కమలాపూర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, జూలై 22: ధర్మపురి మండలానికి తాగు నీరందించే విషయంతో శాశ్వత పరిష్కారం చూపిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కమలాపూర్ గ్రామంలో గల ఫిల్టర్ బెడ్ ను సంబంధిత శాఖ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి ధర్మపురి మండల, పట్టణ ప్రజలు తాగు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల తలాపున గోదావరి ఉండగా డబ్బా నుంచి నీరు అందించే పరిస్థితి నెలకొందన్నారు. పైప్ లైన్‌లో ఏదైనా సమస్యలు ఏర్పడితే 2 నుంచి 3 రోజుల వరకు నీరందించే పరిస్థితి ఉండేదన్నారు. ధర్మపురి మున్సిపాలిటీ, మండల ప్రజలకు శాశ్వత నీటి పరిష్కారం చూపే విధంగా అమృత్ స్కీమ్ కింద సుమారు 17 కోట్ల రూపాయల వ్యయంతో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కమలాపూర్ ఫిల్టర్ బెడ్ నుంచి పైప్ లైన్ ద్వారా ఈ ప్రాంతానికి అందించే విధంగా రూపకల్పన చేశామన్నారు. వాటర్ ఫీడింగ్ గురించి అధికారులతో మాట్లాడామని, ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, మిషన్ భగీరథ ఈఈలు నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖల డీఈఈలు రోహిత్‌రెడ్డి, ధర్మకుమార్, ఏఈఈలు, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, బీసీసెల్ పట్టణ అధ్యక్షులు ఒజ్జల లక్ష్మణ్ పాల్గొన్నారు.

●రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆశీర్వచనం చేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, స్థానిక వేదపండితులు సంగనభట్ల దిలీప్‌శర్మ పాల్గొన్నారు.

రుణ మాఫీపై ఆందోళన అవసరం లేదు

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రుణ మాఫీపై అర్హులైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి వాణితో కలిసి మాట్లాడారు. జిల్లాలో తొలి విడతలో రూ. లక్ష లోపు రుణం మాఫీ అయిందన్నారు. జిల్లాలో 39,523 రైతులు లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. వారందరికీ ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. రైతు రుణ మాఫీకి సంబంధించి ఎటువంటి ఇబ్బందులున్నా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు సంప్రదించాలన్నారు. మండల కేంద్రాల్లో సైతం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు గ్రీవెన్స్ సెల్‌కు 30 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్టిఫికేట్‌కు సంబంధించిన కొన్ని ఫిర్యాదులు అందాయని, పాస్ బుక్ వివరాలు తప్పుగా ఉండడం, పేర్లు మిస్ మ్యాచ్ కావడం వల్ల కొంత మంది రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు అవసరం లేదని, బ్యాంక్ వివరాల ఆధారంగా సరిచేస్తామన్నారు. పట్టాదారు పాస్ బుక్ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమ వారం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా ఈనెల 21వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సగటున 10.9 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా కథలాపూర్ 12.7 మిల్లీ మీటర్లు, మల్లాపూర్‌లో 12.6 మిల్లీ మీటర్లు అత్యల్పంగా కొడిమ్యాల 8.4 మిల్లీ మీటర్లు, మల్యాల 8.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కాగా జిల్లా లోని ఇబ్రహీంపట్నంలో 12.2 మిల్లీమీటర్లు, సారంగపూర్‌లో 11.8 మిల్లీ మీటర్లు, ధర్మపురి, బుగ్గారంలలో 11.7, మెట్‌పల్లి, పెగడపల్లి, గొల్లపల్లి 11.6, రాయికల్ 11.4, బీర్‌పూర్, కోరుట్ల 11.3, ఎండపల్లి 10.7, వెల్గటూరు 9.9, భీమారం, మేడిపల్లిలో 9.7, జగిత్యాలలో 9.6, జగిత్యాల రూరల్ మండలంలో 9.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు.

జిల్లా సంక్షేమ అధికారిగా నరేశ్

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమ అధికారిగా బోనగిరి నరేశ్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీడబ్ల్యూవో వాణి శ్రీ నుంచి పూర్తి అదనపు బాధ్యతలు బోనగిరి నరేశ్ తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ రాంబాబులను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న నరేశ్‌ను జిల్లా సంక్షేమ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ప్రస్తుతం బోనగిరి నరేశ్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్నారు.

రహదారులకు మరమ్మతులు చేయించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి

జగిత్యాల టౌన్, జూలై 22 : అకాల వర్షాలకు దెబ్బతిన్న రహదారులతో పాటు డ్రైనేజీలకు మరమ్మతులు చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో పలు వార్డుల్లో చైర్ పర్సన్ పర్యటించారు. బైపాస్ రోడ్‌లో ప్రమాదకరంగా మారిన గుంతలు పూడ్చడంతో పాటు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించాలని అదేశాలు జారీ చేశారు. కౌన్సిలర్ పద్మ సింగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఉన్నారు.



వర్షాలకు దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న చైర్ పర్సన్

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజావాణిలో కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకుంటున్న దరఖాస్తుదారులు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 37 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డిలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

●కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములను పరిరక్షించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్ పెండం గణేష్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. భూమికి హద్దు ఏర్పాటు చేసి పరిరక్షించాలని కోరినట్లు గణేష్ తెలిపారు.

ఇంటింటా ఇన్నోవేషన్ ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ 2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి 6వ ఎడిషన్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్ని వర్గాల నుంచి ఆవిష్కరణలను స్వీకరిస్తామన్నారు. వాటిల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేస్తామన్నారు. ఆవిష్కర్తలు ఆగస్టు 3వ తేదీ లోపు తమ దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో జగన్ మోహన్, జిల్లా సైన్స్ అధికారి రాజు కుమార్, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి నారాయణ, బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబా, మైనారిటీ అధికారి చిత్రు, ఈడీవో మమత, జిల్లా ఇన్నోవేషన్ కో ఆర్డినేటర్ జలందర్ పాల్గొన్నారు.

తల్లిని దూషించవద్దన్నందుకు..

● తమ్ముడిని హత మార్చిన అన్న ● తండ్రిపైనా దాడి ● గోదావరిఖనిలో దారుణం

కోల్‌సిటీ, జూలై 22: మద్యం సేవించి వచ్చి తల్లిని అసభ్యపదజాలంతో దూషిస్తున్న అన్నను వారించినందుకు తమ్ముడిని హత మార్చిన ఘటన సోమవారం రాత్రి గోదావరిఖని కృష్ణ నగర్‌లో చోటు చేసుకున్నది. కృష్ణనగర్‌లో నివాస ముండే ఆత్మకూరి సునీల్(27)ను అతని నివా సంలోనే అతని అన్న ఆత్మకూరి అనిల్ కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డు వచ్చిన అతని తండ్రి ఓదెలును కూడా పొడిచాడు. ఘటనకు సంబం ధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అంతర్గాం మండలం పెద్దం పేటకు చెందిన ఆత్మకూరి ఓదెలు కుటుంబం కొన్నేళ్ల క్రితం గోదావరిఖనికి వచ్చి స్థిరపడింది. అతడు టెంట్‌హౌస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి అనిల్, సునీల్(27) కుమారులు ఉన్నారు. సునీల్ శ్రీకళ ను ప్రేమ వివాహం చేసుకోగా విజయరాం(3), వియ(2) పిల్లలు ఉన్నారు. అనిల్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుండగా సునీల్ బస్టాండ్ వద్ద హోటల్ నడుపుతున్నాడు. అనిల్ గతంలో హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న సమయంలో ఒక వివాహితను ప్రేమించానని, ఆమెతో తన పెళ్లి జరిపించాలంటూ తల్లి రాజమ్మపై ఒత్తిడి తీసుకు వచ్చేవాడు.



సునీల్ (ఫైల్)



చికిత్స పొందుతున్న తండ్రి ఓదెలు

మద్యానికి బానిసైన అనిల్ తండ్రి టెంట్‌హౌస్‌లోని సామగ్రిని కూడా అమ్ముకుని మద్యం సేవించేవాడు. చిల్లర దొంగతనాలకు సైతం పాల్పడేవా డు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన అనిల్ తల్లి రాజమ్మతో గొడవ పడి అసభ్యపద జాలంతో దూషిం చాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన తమ్ముడు సునీల్ అడ్డు చెప్పడంతో కత్తితో దాడికి పాల్ప డ్డాడు. విచక్షణ రహితంగా పొడవ డంతో సునీల్ కుప్పకూలాడు. అడ్డు వెళ్లిన తండ్రి ఓదెలును కత్తితో పొడిచాడు. అతడు కూడా గాయపడ్డాడు. తీవ్రగాయాల పాలైన సునీల్‌ను గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

రాయికల్, జూలై 22: మండలంలోని మూటపెల్లి గ్రామానికి చెందిన మ్యాకల భూమరాజు(45) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భూమరాజుకు భర్త రాజంతో 20 సంవత్సరాల క్రితం విడాకులు అయ్యాయి. కొడుకు కూడా తండ్రితో పాటు ఉండగా భూమరాజు ఒంటరిగా జీవిస్తోంది. కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

రాయికల్, జూలై 22: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన నందగిరి గంగారాం పెద్ద కుమార్తె శివానీ (18) డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఈ నెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు శివానిని మొదట జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈ నెల 21న హైదరాబాద్ నుంచి జగిత్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శివానీ కుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు.

ఒకరి అరెస్టు

చందుర్తి జూలై 22: గంజాయి కేసు అరెస్ట్ నుంచి తమ్ముడిని తప్పించడానికి తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి ప్రోత్సహించిన కేసులో అన్నను అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్‌పై వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 31 జనవరి 2024న గంజాయి సరఫరా చేసిన సంఘటనలో కేసు నమోదైంది. ఈ నెల 17న చందుర్తి పోలీసులు అఖిల్‌ను అదుపులోకి తీసుకొని, వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. అఖిల్‌ను వేములవాడకు తరలిస్తుండగా తమ్ముడినిని అరెస్టు నుంచి తప్పించడానికి అన్న రాకేష్ అగ్గిపెట్టెలో బ్లేడు తీసుకువచ్చి తమ్ముడైన అఖిల్‌కు ఇచ్చాడు. అఖిల్ బ్లేడుతో చెయ్యి, కాలు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తమ్ముడి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన రాకేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై పడిన చెట్టును తొలగించిన పోలీసులు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వీర్నపల్లి, జూలై 22: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఎల్లారెడ్డిపేట - వీర్నపల్లి ప్రధాన రహదారిపై కంచర్ల శివారులో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎల్లాగౌడ్ సిబ్బందితో కలిసి రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించారు. వాహనదారులకు సమస్యలు తలెత్తకుండా చేశారు.

మారుమూల గ్రామాలకు అదనపు బస్సులు నడపాలి



గర్జనపల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

వీర్నపల్లి, జూలై 22: మారుమూల అటవీ గ్రామాలకు అదనంగా బస్సులు నడపాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జల ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్జనపల్లిలో ప్రధాన రహదారిపై విద్యార్థులు, గ్రామస్థులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సిరిసిల్ల నుంచి వన్‌పల్లి వరకు ఉదయం, సాయంత్రం ఒకసారి బస్సును నడపడంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. నాయకులు దేవేందర్, రాజన్న, అభిషేక్, రవి, సునీల్, బాబు పాల్గొన్నారు.

ఎనిమిది ఆటోలు సీజ్

కరీంనగర్ క్రైం, జూలై 22: కరీంనగర్‌లో మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌లు లేని ఎనిమిది ఆటోలను సీజ్ చేశారు. ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈ వాహన తనిఖీలు నిర్వహించగా టౌన్ ఏసీపీ జి.నరేందర్ పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారం అన్ని ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు పేర్కొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి

● సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల రిలే దీక్షలు




దీక్షలను ప్రారంభిస్తున్న పవర్‌లూం వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ , సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, వస్త్ర సంక్షోభాన్ని నివారించాలని వస్త్రోత్పత్తిదారులు, కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. సోమవారం సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణ, విద్యుత్ సమస్య పరిష్కారం, నేతన్నలకు ఉపాధి కల్పన, పెండింగ్ బకాయిల విడుదలకు జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. నేతన్న పోరుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని సీఐటీయూ ప్రకటించగా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో యాత్ర వాయిదా వేశామన్నారు. 20 రోజులైనా ప్రభుత్వం నుంచి చలనం లేదన్నారు. రిలే దీక్షలకు మద్దతుగా మంగళవారం రాస్తారోకో, 25న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదారాబాద్ చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ విధించి పరిశ్రమ సంక్షోభానికి కారణమైందన్నారు. ఓవైపు సమస్యను సృష్టిస్తూ సానుభూతి ప్రద ర్శించడం సరైన పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నేతన్నల మీద ప్రేమ ఉంటే ప్రధానితో మాట్లాడి కేంద్రం నుంచి వస్త్రాల ఆర్డర్లను ఇప్పించాలని అన్నారు. అనంతరం దీక్షలకు బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు నరేష్, సదానందం, రాజు, శ్రీకాంత్, ప్రకాష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాణీరుద్రమ మాట్లాడుతూ బతుకమ్మ చీరల బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలన్నారు. నేతన్నలకు విద్యుత్ సబ్సిడీతోపాటు సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సిరిసిల్ల ఉత్పత్తులు ఒకప్పుడు బ్రాండ్‌లాగా ఉండేవని, సొంతంగా మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేదని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరల పేరిట ఆదుకుంటామని చెప్పి నాసిరకం చీరలను ఉత్పత్తి చేయించార న్నారు. కార్మికులకు రూ.15 వేల కూలి దొరికేదని, బతుకమ్మ చీరలతో కొంతమంది ఆసాములు లాభపడ్డారని అన్నారు. ప్రభుత్వం బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని, ఆర్డర్లను అందించాలని కోరారు. మొదటి రోజు రిలే దీక్షల్లో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, కాటన్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనా రాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీ యూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వేణు, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, యారన్ అసోసి యేషన్ అధ్యక్షుడు పిస్క మధు, డైయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్య దర్శి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, వస్త్ర వ్యాపార సంఘం కోశాధికారి శ్రీగాధ విష్ణు, డైరెక్టర్లు అన్నల్‌దాస్ శ్రీనివాస్, బొద్దు శ్రీధర్, పాలిస్టర్ అసోసియేషన్ కోశాధికారి మండల బాలరాజు, శ్రీరాం సత్యం, మండల రాజు, గాజుల లింగం దీక్షల్లో కూర్చున్నారు. దీక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మండల సత్యం తదితరులు ప్రారంభించారు.

చెరువులో పడి బాలుడి మృతి



సాయికృష్ణ(ఫైల్)

తిమ్మాపూర్, జూలై22: మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో ప్రమాదవ శాత్తూ చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళిపాలెం గ్రామానికి చెందిన జువ్వాజి మురళి, పద్మల ఏకైక కుమారుడు జువ్వాజి సాయికృష్ణ(12) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన సాయికృష్ణ మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలోని ముగ్గురు స్నేహితులు కలిసి పాఠశాల వెనకాల గల ఊర చెరువు వద్దకు సైకిల్‌తో ఆడుకుంటూ వెళ్లాడు. చెరువు సమీపంలో సాయికృష్ణ బహిర్భూమికి వెళ్లి చెరువు మెట్ల వద్ద నీటి వద్దకు వెళ్లాడు. ప్రమాదవ శాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. సాయికృష్ణతో వచ్చిన మిత్రులు గమనించి స్థానికంగా పొలంలో ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికితో పాటు సాయికృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే చెరువులోకి దిగి వెతకగా మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఇద్దరు నేరస్తులపై పీడియాక్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కోరుట్ల, జూలై 22 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు సోమవారం వెల్లడించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని ఝూన్సిరోడ్డుకు చెందిన విత్తనాల నాగరాజు, అర్బన్ కాలనీకి చెందిన గుడ్ల విశాల్‌లపై ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పీడి యాక్ట్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కోరుట్ల పట్టణంతో పాటు కరీం నగర్ ఉమ్మడి జిల్లాలో హత్య కేసులు, సుపారి హత్యలు, బలవంతపు వసూళ్లలో నిందితులుగా ఉన్న నాగరాజు, విశాల్‌లపై పీడీ యాక్ట్‌ను విధించగా వారు ప్రస్తుతం హైదరాబాదులోని చెర్లపల్లి జైలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు వివరించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన మామిడిపల్లి వంశీ (27) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశీ ఒక అమ్మాయిని ప్రేమించాడని , ఆమెను పెళ్లి చేసుకుంటానని ఇంట్లో తెలుపగా తిరస్కరించినట్లు తెలిపారు. ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని ఆందోళన చెంది ఈ నెల 14న గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద పురుగుల మందు ఆత్మహత్యాయత్నం చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతుడు వంశీ సమాచారం ఇవ్వడంతో పెద్దపల్లి ఆసుపత్రికి అక్కడి నుండి కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లోనూ తనిఖీ ● చెడిపోయిన వస్తువులను పడేసిన అధికారులు



కుళ్లిపోయిన పదార్థాలను పడేసిన అధికారులు

మల్యాల, జూలై 22: మల్యాలలోని బేకరీలు, తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. కాలం చెల్లిన వస్తువుల వినియోగం, బూజు వచ్చిన తినుబండారాల అమ్మకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మల్యాలలో గల బేకరీల్లో బూజు వచ్చిన కేకులు, కాలం చెల్లిన బిస్కట్లు, ఆరోగ్యానికి హాని చేసే రంగుల క్రీమ్‌లు లభించడంతో ఆహార తనిఖీ అధికారి ఆర్.అనూష మండిపడ్డారు. చిన్నపిల్లలు తినే ఇలాంటి వాటిని శుచి, శుభ్రతతో కాకుండా అధ్వాన్నంగా బూజు వచ్చిన వాటితో తయారు చేసి అమ్మడం ఏమిటని, ఆహార విక్రయాలకు సంబంధించి సర్టిఫికెట్లు తీసుకోకపోవడంపై నిర్వాహకులను నిలదీశారు. వారం రోజుల్లోగా తీరు మార్చుకోవాలని లేనిచో సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూజు వచ్చిన కేక్‌లు, బిస్కట్ పాకెట్లు, రంగుల పొడిలు ఇతర వస్తువులు పడేశారు. అంతకు ముందు తాటిపల్లి బాలికల గురుకుల హాస్టల్‌లో తనిఖీలు చేసి చెడిపోయిన ఉల్లిగడ్డలను వంటలలో వినియోగించడం, ఆదివారం నాటి మటన్ సోమవారం వండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

గంగాధర, జూలై 22: గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న యాజమానిపై జిల్లా లేబర్ ఆఫీసర్ గుండేటి చక్రధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లేబర్ ఆఫీసర్ నేతృత్వంలోని బృందం గంగాధర మండలంలో ఆపరేషన్ ముస్కాన్10లో భాగంగా తనిఖీలు చేపట్టారు. మధురానగర్ చౌరస్తాలో రాజస్థాన్‌కు చెందిన సురేష్ చంద్ర గుజ్జర్ అనే అతను తన పానిపూరీ బండి వద్ద 11 సంవత్సరాల బాలుడిని పనిలో పెట్టుకున్నాడు. బాలుడి వివరాలు సేకరించిన జిల్లా లేబర్ ఆఫీసర్ యాజమాని పనిలో పెట్టుకున్నట్లు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాష్‌పాండ్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా నేడు

కోల్‌సిటీ, జూలై 22: ఎన్‌టీపీసీ రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా యాష్ పాండ్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్రభావిత గ్రామాలైన ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, లక్ష్మీపూర్, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్ గ్రామస్థులు రిజర్వాయర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాలను కాదని ఆన్‌లైన్ బూడిద టెండర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిరాఆఙ. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిజాయితీ చాటుకున్న మహిళ



మహిళను సన్మానిస్తున్న ఎస్సై

రామగిరి, జూలై 22: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన నీర్ల విజయ అనే గృహిణి తనకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను అప్పగించి సోమవారం తన నిజాయితీ చాటుకుంది. గ్రామానికి చెందిన చెల్పూరి రాజమౌళికి చెందిన రూ.80వేల విలువ గల సెల్‌ఫోన్ ఫ్యాంట్ జేబులోంచి దారిలో పడిపోయింది. సదరు మహిళ సెల్‌ఫోన్ దొరికిన వివరాలను మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డికి తెలుపగా పోలీస్‌స్టేషన్ అప్పగించాల్సిందిగా సదరు మహిళకు సూచించారు. అదే గ్రామానికి చెందిన రాజమౌళిదిగా పోలీసులు గుర్తించి అప్పగించారు. సదరు మహిళను ఎస్ఐ సందీప్ అభినందించారు.

రైస్ మిల్లుల్లో అధికారుల విస్తృత తనిఖీలు

● ఇతర జిల్లాల సివిల్ సప్లయ్ అధికారులకు బాధ్యతలు



జగిత్యాలలో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు



కాల్వశ్రీరాంపూర్‌లోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని సాయిసుధ ఇండస్ట్రీస్, కొత్త శ్రీయాన్ రైస్ మిల్లు, సిరికొండ జీఎస్‌కే ఇండస్ట్రీస్, కొండికర్ల మహాలక్ష్మి ఇండస్ట్రీస్, పెద్దాపూర్ నిజాం ఆగ్రో ఇండస్ట్రీస్, చెప్యాల్ శ్రీ లక్ష్మీ సరస్వతీ ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ సాయి ఇండస్ట్రీస్, గగన్ ట్రేడర్స్ ఇండస్ట్రీస్, నూకపల్లి గునా ఇండస్ట్రీస్, చందోల్ మాధవి ఆగ్రో ఇండస్ట్రీస్, శివ సాయి ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీమన్ననారాయణ ఇండస్ట్రీస్, మణికంఠ ఆగ్రోటెక్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, జగిత్యాల జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయి కార్పొరేషన్ మేనేజర్ హతీరాం, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, ఈజీఎస్ ఏపీడీ మధన్ మోహన్, తహసీల్దార్లు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● **కాల్వ శ్రీరాంపూర్ :** మండలంలోని మంగపేట గ్రామంలోని అన్నదాత ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సోమవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, సేల్స్ రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్, డీఎం శ్రీకాంత్, డీటీసీఎస్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎఫ్ఐ మల్లికార్జునరావు, ఆర్ఐ రాజేందర్, స్థానిక ఎస్సై ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల బదిలీలు

కరీంనగర్ క్రైం, జూలై 22: జిల్లా అటవీశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన పలువురు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు స్థానచలనం జరిగింది. కరీంనగర్ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో) గంటల శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో తాడ్వాయిలో పనిచేస్తున్న ఎఫ్ఆర్‌వో షౌకత్‌హుస్సేన్ నియామకమయ్యారు. హుజూరాబాద్ ఎఫ్ఆర్ రాజేశ్వర్‌రావు భూపాలపల్లి జిల్లా కొయ్యూర్ రేంజ్‌కు బదిలీ అయ్యారు. గంగాధర డిప్యూటీ ఎఫ్ఆర్‌వో కిరణ్మయి కరీంనగర్ స్ట్రైకింగ్‌ఫోర్స్‌కు, సిరిసిల్ల డిప్యూటీ ఎఫ్ఆర్‌వో బాపిరాజం గంగాధరకు బదిలీ అయ్యారు. చొప్పదండి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వి వేణుభరణ్ కరీంనగర్‌కు, శంకరపట్నంలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో సరిత కామారెడ్డికి, వేములవాడలో పనిచేస్తున్న ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ చొప్పదండికి బదిలీ అయ్యారు. జమ్మికుంటలో పనిచేస్తున్న ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్ అనంతరాం గంగాధరకు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సమీనాసర్వీన్ తిమ్మాపూర్‌కు, అక్కడ పనిచేస్తున్న ఎఫ్‌బీవో సుజాత కరీంనగర్ డీర్‌పార్క్‌కు బదిలీ అయ్యారు.

ఫేక్ ఐడీతో మహిళలకు చాటింగ్

రుద్రంగి, జూలై 22 ఓ యువకుడి ఫొటోను స్నాప్ చాట్‌లో ప్రొఫైల్‌గా పెట్టి ఫేక్ అకౌంట్‌తో మహిళలకు చాటింగ్ చేసిన సంఘటన రుద్రంగిలో వెలుగుచూసింది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దినేష్ అనే యువకుడి ఫొటోను స్నాప్‌చాట్‌లో ప్రొఫైల్ పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశారు. దీంతో మహిళలకు అసభ్యకరంగా చాటింగ్ చేస్తున్నారని, స్నాప్‌చాట్ ఫేక్ ఆకౌంట్‌తో చాటింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దినేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్ఐ సిరిసిల్ల ఆశోక్ తెలిపారు.

సబ్బితం జలపాతం సందర్శనకు రావద్దు



జలపాతం సందర్శనకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎంపీవో

పెద్దపల్లి రూరల్, జూలై 22: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టు సింగారం గౌరిగుండాల జలపాతం సందర్శన నిషేధించామని సందర్శకులు ఎవరూ రావద్దని ఎంపీవో సుదర్శన్ సూచించారు. సోమవారం మండలంలోని రంగాపూర్ నుంచి సబ్బితం వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం గౌరిగుండాల జలపాతాన్ని ఎంపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శనకు పలువురు యువకులు రాగా జలపాతానికి వరద ఎక్కువగా వస్తుందని, ఈ సందర్భంగా సందర్శనను నిషేధించినట్లు వారికి తెలిపి వెనక్కి పంపించారు. సందర్శకులు, యువకులు గమనించి సహకరించాలని ఎంపీవో సుదర్శన్ సూచించారు. వారి వెంట ఏపీవో రమేష్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఇండ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 20,023 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి రాక పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,023 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం సోమవారం 21.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 42.534 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుం చి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 15.108 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

కోటిలింగాల వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

వెల్గటూర్, జూలై 22: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. వాగులు, వంకలు పొంగి గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 3389 క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలోకి వరద నీరు చేరి నీటి మట్టం పెరుగుతోంది.

గంజాయి విక్రయదారుల అరెస్టు



అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల పోలీసులు



పెద్దపల్లి బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

సిరిసిల్ల క్రైం, జూలై 22: ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల వద్ద గంజాయి విక్రయిస్తున్న తాళ్లపల్లి గ్రామానికి చెందిన తలపల్లి నాగిరెడ్డి (24), కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గుర్రాల నిఖిల్‌రెడ్డి(19)లు అనే యువకులను అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి తెలిపారు. సిరిసిల్ల సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఆయన అరెస్ట్ వింరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలంలోని తాళ్లపల్లి గ్రామా నికి చెందిన నాగిరెడ్డి అనే యువకుడు కరీంనగర్‌లోని వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ గుర్రాల నిఖల్‌రెడ్డితో పరిచయం ఏర్పడిందన్నారు. ఇద్దరు యువకులు గంజాయి తాగడానికి అలవాటు పడి మరికొందరికి విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఇల్లంతకుంటకు వస్తున్నారనే సమాచారం మేరకు మార్గమధ్యలో వంతడ్పుల వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా 100 గ్రాముల గంజాయి లభించిందన్నారు. దీంతో 100 గ్రాముల గంజాయిని, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే డయల్ 100 లేదా 8712656392కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

పెద్దపల్లి టౌన్: గంజాయి మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సోమవారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేప ట్టారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీంచారు. బస్సులు, ట్రైన్‌లలో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు చేశారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటిని అరికట్టడం, రవాణా, నియంత్రణలో భాగంగా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్, పార్సిల్ సర్వీస్ కేంద్రాలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతీ పార్సిల్, రవాణా బ్యాగులను, ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు చేపడుతామని తెలిపారు.

కాళేశ్వరం తెలంగాణకు జీవధార

● ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న కొప్పుల

కరీంనగర్ టౌన్, జూలై 22: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే చరిత్రహీనులవుతారని ఆయన హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఆయన నివాసగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిండుకుండలా మేడిగడ్డ బ్యారేజీ మారిందన్నారు. కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయిందని, కాళేశ్వరం కొట్టుకు పోయిందంటూ కాంగ్రెస్ పార్టీ, యూట్యూబ్ చానెళ్ల నెలల పాటు దుష్ప్రచారం చేసినా వాళ్ల కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు నేడు మేడిగడ్డ వద్ద ప్రవహిస్తోందని అన్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ ఇన్‌ఫ్లో 8 లక్షల 20వేల క్యూసెక్కులుంటే అవుట్ ఫ్లో 8 లక్షల 20 వేల క్యూసెక్కులని చెప్పారు. 85 గేట్లు ఎత్తి దిగువకు నీళ్ల వదులుతున్నారని అన్నారు. ఆరు రోజుల్లో 73 టీఎంసీల నీరు సముద్రం పాలైందని అన్నారు. 7వ బ్లాక్‌లోని 20,21వ పిల్లర్‌లు సురక్షితంగా ఉన్నాయని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూసివేస్తేనే ప్రాజెక్టు గురించి తెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ వింతవాదన చేస్తోందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డిలు చెబితే గేట్లు తెరవడం కానీ, మూయడం కానీ జరుగదని,అది నీళ్ల వరద మీద ఆధారపడి ఉంటుందన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

గంగాధర,జూలై 22: గంగాధరలో మోడల్ స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు మొరాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం గంగాధర మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్లుతున్న ఆర్టీసీ బస్సు మధురానగర్ చౌరస్తాలో నిలిపి విద్యార్థులను ఎక్కించుకునే తరుణంలో ఆగిపోయింది. డ్రైవర్ బస్సును స్టార్ట్ చేద్దామని అరగంట ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. చేసేది లేక విద్యార్థులు వెనక నుంచి నెట్టినా ఎంతకీ స్టార్ట్ కాలేదు. దీంతో మరో బస్సును రప్పించి విద్యార్థులను పాఠశాలకు చేర్చారు. అరగంట పాటు ఆచంపల్లి, గరకుర్తి, తాడిజెర్రి, రంగరావుపల్లి, కురిక్యాల, మధురానగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్తామా లేదా అని ఆందోళన వ్యక్తం చేశారు.



నిలిచిపోయిన బస్సును నెట్టుతున్న విద్యార్థులు

రూ.7,260 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7260 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 81క్వింటాళ్లు విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ట ధర రూ.7260, కనిష్ట ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బురదమయం కోనాపూర్-భూషణరావుపేట రోడ్డు

● రాకపోకలకు తీవ్ర అంతరాయం



బురదమయంగా మారిన కోనాపూర్ - భూషణరావుపేట రోడ్డు

కథలాపూర్, జూలై 22 : మూడు రోజులుగా కురుస్తున్న వానల కారణంగా రెండు జిల్లాల సరిహద్దు రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. నిజామాబాద్ జిల్లా కోనాపూర్ వాసులు ప్రతీనిత్యం జగిత్యాల జిల్లాతోనే సత్సంబంధాలు కలిగి ఉంటారు. వందలాది వాహనాలు వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటాయి. ఏ చిన్న పనికైనా భూషణరావుపేట మీదుగా కథలాపూర్, కోరుట్ల వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డు మంజూరు కాగా కాంట్రాక్టర్ మట్టి పనులు చేపట్టారు. పాఠశాల సమీపంలో పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనాలు దిగబడి పోతున్నాయి. పాఠశాల బస్సులు అటు వైపు వెళ్ళడానికి వీలులేకుండా పోయింది. టాటా ఏసర్, ఆటోలు బురదలో చిక్కుకున్నాయని గ్రామస్థులు తెలిపారు. కోనాపూర్ వాసులు కథలాపూర్ రావాలంటే ఆత్మకూర్ మీదుగా తిరిగి రావాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు

కథలాపూర్, జూలై 22 : కరీంనగర్ మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు శనివారం కథలాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపురెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్యగంగాధర్, మాజీ వైస్‌ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, మాజీ ఎంపీపీ నాం పల్లి లింబాద్రి, జవిడి ప్రతాప్‌రెడ్డి, బద్దం మహేందర్, పూండ్ర జనార్ధన్ ఉన్నారు.

మల్యాల: రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను మల్యాలలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేకు కట్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, నూకపల్లి సింగిల్ విండో చైర్మను మధుసూధన్‌రావు, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి నాయకులు దేవరాజం, అజర్, జున్న సురేందర్, కొంక నర్సయ్య, త్రినాద్, సంజీవ్, గుడిసె రవి, తిరుపతిగౌడ్, చిన్నదుర్గయ్య పాల్గొన్నారు

కొడిమ్యాల : బోయినిపెల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో టీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు స్వామి, లక్ష్మారెడ్డి, రమేష్, శ్రీనివాస్, సల్మాన్, అనిల్, చాంద్‌పాషా, హరెందర్, రత్నాకర్, సత్యంరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల, జూలై 22 : కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రూ. 7.12,000 చెక్కులను పంపిణీ మండల, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పోగుల ఉమారాణి, పేర్ల సత్యం, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాదాపూర్ సింగిల్ విండో చైర్మన్ అదిరెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ సింగిరెడ్డి నారాయణరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

విశిష్ట సేవా పురస్కారం అందుకున్న 'అడెపు'



అవార్డును అందుకుంటున్న అడెపు మధు

కోరుట, జూలై 22 : 320 జీ లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కోరుట్ల పరిసర ప్రాంతాల ప్రజలకు వివిధ రకాలుగా సేవలు అందించిన అడెపు మధుకు లయన్స్ క్లబ్ మల్టీపుల్ సభ్యులు గుర్తించి విశిష్ట సేవా పురస్కారాన్ని అందించారు. కరీంనగర్ పట్టణంలోని కేఎస్ఎల్ గార్డెన్‌లో జరిగిన అవార్డు కార్యక్రమంలో 320 జీ మల్టీపుల్ ఛైర్మన్ హనుమాండ్ల రాజారెడ్డి విశేష సేవ అవార్డును అడెపు మధుకు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అడెపు మధు మాట్లాడుతూ తనను అవార్డుకు ఎంపిక చేసిన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్‌వి కోదండ రాములు, రెండవ జిల్లా గవర్నర్ మోర బద్రేశం, కోరుట్ల లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ దిలీప్ రావు, గుంటుక ప్రకాష్, అల్లాడి ప్రవీణ్, పోతని ప్రవీణ్, చాపకిశోర్‌లు అడెపు మధును సన్మానించి అభినందించారు.

సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలి

ధర్మపురి, జూలై 22: సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సోమవారం ధర్మపురి మండల గ్రామపంచాయితీ కారోబార్ యూనియన్, సిబ్బంది వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 51, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, కేటగిరీ వారిగా గుర్తించి కనీస వేతనం రూ 19,500 ఇవ్వాలని కోరారు. ఆరోగ్య భద్రత కల్పించాలని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా ప్రభుత్వ విప్ స్పందించి వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కారోబార్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కట్ట గంగారం, అధ్యక్షులు దుంపెట రమేష్, ఉపాధ్యక్షులు సంబేట రాము, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రంజిత్, కోశాధికారి అల్లూరి అంజయ్య, సలహాదారు కొండ నారాయణ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

జగిత్యాల అర్బన్, జూలై 22: రానున్న అసెంబ్లీ సమావేశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా స్పష్టమైన ప్రకటన చేయాలని జిల్లా ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ శంకర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు కేటాయిస్తామన్న 250 గజాల స్థలంతో పాటు పెన్షన్ అందించాలని, ఉద్యమకారులకు ప్రభుత్వం తరుపున గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, జార్ఖండ్ ప్రభుత్వ తరహాలో ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు సౌకర్యంతో పాటు, హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గంగారెడ్డి, రాజు, గంగస్వామి, చింతల గంగాధర్, సురేష్, నాచుపెల్లి రెడ్డి, శేఖర్, గంగాధర్ తదితరులున్నారు.

రైతువేదికల్లో అరకొర వసతులు

● అటెండర్లు లేక సిబ్బందికి అవస్థలు
● ప్రహరీ నిర్మాణాలపై పట్టింపు కరువు

కథలాపూర్, జూలై 22 : రైతులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అములు చేసే పథకాల గురించి తెలుసుకోవడంతో పాటు చర్చించుకునేందుకు నిర్మించిన రైతు వేదికల్లో అసౌకర్యాలు తిష్ట వేశాయి. గత బీఆర్ఎస్ సర్కారు మూడేళ్ల కిందట క్లస్టర్ల వారీగా విభజించిన ప్రదేశాల్లో రైతు వేదికలు నిర్మించింది. అయితే ఆ సమయంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ప్రస్తుతం సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఎదురైంది.

● అటెండర్లు, ప్రహరీ లేక అవస్థలు

మండలంలో అంబారిపేట, భూషణరావుపేట, బొమ్మెన, గంభీర్‌పూర్, కథలాపూర్ గ్రామాల్లో రైతువేదికలు నిర్మించారు. దీనికిగాను రు. 10 లక్షలు ఉపాధిహామీ, రూ. 16 లక్షలు వ్యవసాయ శాఖ నిధులతో రైతు వేదికలను నిర్మించగా హడావుడిగా పనులు పూర్తి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో రైతువేదికకు 25 కుర్చీలు, సౌండ్ సిస్టమ్, ఫర్నిచర్‌ను కూడా సరఫరా చేశారు. రైతువేదికల్లో ఏఈవోలు ప్రతీదినం రైతుల కోసం అందుబాటులో ఉంటున్నారు. అయితే చెత్తా, చెదారం ఊడ్చడం, తాగునీరు పెట్టడానికి అటెండర్లను నియమించక పోవడం వల్ల ఏఈవోలకు ఇబ్బందిగా మారింది. మూడేళ్ల కిందట రైతువేదికల నిర్వాహణకు



కథలాపూర్ రైతు వేదిక

ప్రతీ నెలా రూ. 9 వేల చొప్పున అప్పటి ప్రభుత్వం ఇచ్చి తదనంతరం నిధుల కేటాయింపు నిలిపివేసింది. ఈ క్రమంలో ఏఈవోలకు నిర్వహణ భారం తలనొప్పిగా తయారైంది. పలు రైతువేదికల్లో తలుపులు ఊడిపోవడం, ఫ్యాన్లు చెడిపోతుండగా మరమ్మతులు ఏఈవోల సొంత ఖర్చులే వెచ్చించాల్సిన దుస్థితి పట్టింది. ఏ ఒక్క రైతువేదికకు కూడా ప్రహరీ గోడలు నిర్మించని కారణంగా పశువులు ఆ ప్రాంగణంలోకి వస్తున్నాయి. అంబారిపేట, బొమ్మెన, గంభీర్‌పూర్ రైతువేదిక దాకా సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. రైతులకు పంటల సాగుపై సమగ్ర సమాచారం అందించేందుకు నిర్మించిన రైతువేదికల ఆలనా, పాలనా చూసుకునే నాథుడే కరవయ్యాడని రైతులు వాపోతున్నారు.

అటెండర్లను నియమిస్తే భారం తగ్గుతుంది

శేఖర్, ఏఈవో



రైతువేదికలకు రైతులు ప్రతీరోజూ పంటల సాగుపై నెలకొనే పలు రకాల అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు వస్తుంటారు. తాము పల్లెల్లోకి ఉదయం క్షేత్ర పర్యటనలకు వెళ్తే రైతువేదికలు మూసి ఉండే పరిస్థితి ఉంది. అటెండర్లను శాశ్వత ప్రాతిపదికన నియమిస్తే ఉదయం పూటనే రైతువేదికలను తెరిచి ఉంచడానికి అవకాశం ఉంటుంది. స్టేషనరీ, వేదిక నిర్వహణ నిమిత్తం ప్రతీ నెలా బడ్జెట్ విడుదల చేస్తే రైతులకు సకాలంలో సేవలు అందడానికి ఆస్కారం ఉంటుంది.

ప్రజావాణిలో ఒకే ఒక్కరు..

ప్రజల వినతులకు ఆసక్తి చూపని అధికారులు!

మల్యాల, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పిర్యాదు తీసుకోవ డానికి మల్యాల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రభుత్వ శాఖల అధికారులు ఆసక్తి చూపడం లేదు. పదుల సంఖ్యలో ప్రభుత్వ శాఖలు ఉంటే కేవలం మూడు, నాలుగు శాఖల కింది స్థాయి సిబ్బంది మాత్రమే హజరై సంతకాలు చేసి వెళ్లి పోతున్నారు. దీంతో ప్ర జావాణి మొక్కుబడి కార్యక్రమంగా మారింది. అధికారులు ఉండకపోవడంతో ప్ర జలు కూడా ఈ కార్యక్రమం పట్ల పెదవి విరుస్తున్నారు. అధికారులు కాకుండా కార్యాలయ సిబ్బందిని పంపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వారం ఇలాగే కొనసాగుతున్నప్పటికీ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజావాణిని తూతూ మంత్రంగా ముగిస్తున్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంకు నాయబ్ తహసీల్దార్, ఇరిగేషన్, ఎంపీపీ కార్యాలయ సిబ్బంది, ఐసీ డీఎస్ సూపర్‌వైజర్లు మరొకరు వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయారు. ఇప్పటికైన అధికారులు ఈ కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొని ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల హాజరు అంతంతే

పెగడపల్లి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారానికోమారు నిర్వహించే ప్రజావాణికి అధికారుల హాజరు కనిపించడం లేదు. ప్రతి సోమవారం తహసీ ల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి తహసీల్దార్‌తో పాటు అన్ని శాఖల



మల్యాలలో అధికారులు లేని ప్రజావాణి కార్యక్రమం

మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా పెగడపల్లి మండలంలో ఆ ఆనవాయితీ కనిపించడం లేదు. గత వారం తహసీల్దార్‌తో పాటు మరొక్కరు మాత్రమే హాజరు కాగా ఈ వా రం తహసీల్దార్‌తో పాటు ఎంపీవో, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరయ్యారు. అధికారుల గైర్హాజరుపై తహసీ ల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాదికారులకు నివేదిస్తామన్నారు.

కోరుట్ల ఆర్టీసీ డీఎంగా మనోహర్

కోరుట, జూలై 22 : కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ డీఎంగా పని చేస్తున్న విజయ మాదురి కరీం నగర్ డిపో 1కి బదిలీపై వెళ్లగా సిరిసిల్ల డిపో మేనేజర్‌గా పని చేసిన మనోహర్ కోరుట్ల డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌ను డిపో అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు

మెట్‌పల్లి రూరల్, జూలై, 22: మండలంలోని కోనరావుపేట గ్రామ కార్యదర్శిగా గుజ్జెటి రాజ్‌కుమార్ విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో పరిష్కరించానని, ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనన్నారు. కాగా పలువురు ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు కార్యదర్శి పనితీరును కొనియాడారు. అనంతరం పాలకవర్గ సభ్యులు కార్యదర్శిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు

పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం

● పలు తీర్మానాలకు ఆమోదం తెలిపిన కౌన్సిల్ ● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, జూలై, 22 : పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసుకుందామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత-సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని కోరుట్ల ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతి రోజు వార్డులలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గతంలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనుల ను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. 14,16,18,20,26 వార్డుల కు చెందిన కౌన్సిలర్లు మాట్లాడుతూ పెద్దచెరువును మరమ్మతు చేయించాలని, పలు ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలు పెద్దచెరువులో వేస్తున్నారని వాటిని నిరోధించి సంబంధిత ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయాలని కోరారు. మిషన్ భగీరథ నల్లా నీటిని వృదాకాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను ఇతర ప్రాంతానికి తరలించాలని, పట్టణంలో కుక్కలు ప్రజలపై దాడు చేస్తున్నాయని వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. సమావేశంలో 27 తీర్మానాలు ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులందరూ ఆమోదం తెలిపారు. అనం తరం బదిలీపై వెళ్తున్న మున్సిపల్ ఉద్యోగులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, సంబంధిత అధికారులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న వీహెచ్‌పీ కార్యకర్తలు

ధర్మపురి, జూలై 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అన్నారు. ధర్మపురి పట్టణంలోని శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వృక్షారోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆలయ ఆవరణలో 30 మొక్కలు నాటారు. వృక్షారోజన్ రోజున దేవతా వృక్షాలు రావి, మేడి, జువ్వి, ఉసిరి, మామిడి లాంటి ఫల మొక్కలు, పూల మొక్కలు వర్షాకాలంలో ఏదేని ఒక దేవాలయంలో నాటడం జరుగుతుందని వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ సామాజిక సమ రసత కరీంనగర్ ప్రముఖ్ అల్లం దుర్గప్ర సాద్, జగిత్యాల జిల్లా ప్రముఖ్ కస్తూరి రాజన్న, పట్టణ అధ్యక్షులుగా ముత్యపు రమేష్, మండల అధ్యక్షులు మామిడాల రవీందర్, నగర కార్యదర్శి బుచ్చన్న, ఉపాధ్యక్షులు పురంశెట్టి లచ్చన్న, గాదె లక్ష్మణ్, కార్యదర్శిగా బుచ్చన్న, రాజేష్, పూర్ణచందర్, సురేష్, రాజేష్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, శివసాయి, తిరుపతి పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి

కోరుట్ల, జూలై 22 : సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలో ఇచ్చిన హమీల అమలుతో పాటు బీసీ డిక్లరేషన్ వెంటనే ప్రకటించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమావారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయలో ఆర్ఐ రాజేందర్ రావుకి వినతి ప్రతం అందించారు. బీజేపీ నాయకులు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హమీలు మరిచి పరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి : సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో ఇచ్చిన హామీ బీసీ డిక్లేరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణచైతన్యకు సోమవారం నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 22 శాతం ఉన్న రిజర్వేషన్లను 42 వరకు పెంచాలని, అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయెంబర్స్‌మెంట్ ఇవ్వాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా ఉన్నత విద్య కోసం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, అసెంబ్లీ కో-కన్వీనర్ బండారి లక్ష్మణ్, శ్రీనివాస్, నరేష్, తిరుపతి, సత్యనారాయణ, శ్రీనివాస్, శివసాయి, శంకర్, సాత్విక్ పాల్గొన్నారు.

కథలాపూర్: కాంగ్రెస్ సర్కారు కామారెడ్డి లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు కథలాపూర్‌లో తహసీల్దార్ ముంతాజీబోద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 47కు పెంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి గొల్ల, కురుమలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వొడ్డాటి సునిల్, బీజేపీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి, కాశోజీ ప్రతాప్, బద్రి సత్యం, కథలాపూర్ మహేశ్, నాగభూషణం, శ్రీకర్ ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతి ప్రతం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఎండపల్లి: మండలంలోని ఎండపల్లి తహసీల్దార్ రవి కాంత్‌కి బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సీఎం బీసి డిక్లరేషన్ అమలు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదని మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు అన్నారు. పలు డిమాండ్లతో కలిగిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కి అంద జేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రాంబాబు, హన్మంత రావు, అమరకొండ దివాకర్, శ్రీను, నరేష్, రవి, ప్రమోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యే పరామర్శ

మెట్‌పల్లి, జూలై, 22 : పట్టణంలోని 9వ వార్డులో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ మొరపు గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు ఉజగిరి శ్రీను, బెజ్జారపు మదుసూదన్, బొడ్ల శ్రీనివాస్, బొడ్ల రాజేందర్, మొరపు తేజ, షేక్ ఫిరోజ్, రాజన్న, భరత్, పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కొడిమ్యాల, జూలై 22 : రైతు బీమా 2024 సంవత్సరానికి గాను అర్హత కలిగిన రైతులు ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏవో జ్యోతి కోరారు. సోమవారం ఏవో విలేకరులతో మాట్లాడుతూ గతంలో బీమా కలిగిన రైతులు జూలై 30లోగా మార్పులు, చేర్పులు చేసుకోవటానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. జూన్ 28, 2024 వరకు పట్టాపాస్ పుస్తకం కలిగి, 18ఏళ్ల నిండి 59 ఏళ్ల కలిగిన వారంతా అర్హులే అన్నారు. అర్హత కలిగిన రైతులు వారి గ్రామ పరిధిలోని ఏఈవోను సంప్రదించి ఏఈవో సమక్షంలోనే నమోదు పత్రంపై బీమా పొందే రైతు స్వయంగా వేలిముద్ర, సంతకం చేయాలన్నారు. అర్హత కలిగిన రైతులు పట్టాపాస్ పుస్తకం ఆధార్‌కార్డు, నామిని ఆదార్‌కార్డు, నమోదు పత్రాన్ని ఏఈవోకు అందించాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొడిమ్యాల, జూలై 22 : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, జిల్లా నాయకులు వంగ రాజేశం, జంగిలి ఎల్లయ్య, మల్లేశం, గర్శకుర్తి రాజు, రవి, అంజన్న ఉన్నారు.

గ్రామస్థుల నిరసన

జగిత్యాలరూరల్, జూలై 22 : జగిత్యాల మండలం తిప్పన్నపేట వైద్య ఉపకేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న రెండవ ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిప్పన్నపేట గ్రామస్థులు సోమవారం పల్లె దవాఖానా ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులకు హాజరుకాకుండా ప్రశ్నించినందుకు ఇతరులపై నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గ్రా మస్థులు చింతకుంట్ల గంగాధర్, రమేష్, అమృత, బాబక్క, భీమరాజవ్వ, చింతకుంట్ల ఉమ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

మల్యాల, జూలై 22: భారత ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నూతన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సై నరేష్‌కుమార్ అన్నారు. మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ గతంలోని చట్టాలు, కొత్త చట్టాల మధ్య గల తేడాలను వివరిస్తూ భవిష్యత్తులో నేరాల వైపు దృష్టి సారించకూడదని సూచించారు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల: ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన మండలంలోని కోనాపూర్ నుంచి సూరంపేట గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న మాటుకుంట కట్టను సోమవారం కొడిమ్యాల తహసీల్దార్ రాజమణి, ఆర్.ఐ కరుణాకర్, కోనాపూర్ గ్రామ మాజీ సర్పంచు స్వామి రెడ్డి, సిబ్బంది రోడ్డుపై మొరం పోయించి మరమ్మతు చేయించారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేటకు చెందిన మల్యాల గంగాధర్ అనే యువకుడు ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులకు రాగుట్ల భూమేష్ -జమున రూ.3వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మాజీ ఎంపీపీ ఆదిరెడ్డి 50కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో కొమ్ముల సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

● ఆటోడ్రైవర్ల సాయం..

మల్యాల బీసీ కాలనికి చెందిన బెక్కం లక్ష్మన్ అనే యువకుడు ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబానికి జగిత్యాల జిల్లా యువ తెలంగాణ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయం అందించారు. 50కిలోల బియ్యంతో పాటు నగదు అందజేశారు. శివలాల్ నాయక్, మొగిళి, కొమురయ్య, సంపత్‌గౌడ్, గణేష్, రమణ, సాయి అనిల్ పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో తెలిపారు. రైతులు 18 నుంచి 59 సంవత్సరాల్లోపు ఉంటే ఆగస్టు 4వ తేదీలోగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీర్‌పూర్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 116 మంది రైతులు ఇటీవల కాలంలో కొత్త పాసు పుస్తకాలు పొందడం వలన రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు. పట్టా పాసుబుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, నామిని ఆధార్ జిరాక్స్‌లను దరఖాస్తు ఫారంతో పాటు జ త చేసి వ్యవసాయ కార్యాలయంలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి ఇవ్వాలని సూచించారు.